కథ

ఆ రోజు ఆదివారం కావటం వల్ల 'ఓషన్‌పార్కు' చాలా సందడిగా వుంది...రంగురంగుల దుస్తుల్లో, రకరకాల ఆటలాడుతూ- తుళ్లింతలూ కేరింతలతో ఎటుచూసినా పిల్లలే!... వాళ్లలా నానా అల్లరీ చేస్తూంటే- వాళ్లను మందలిస్తూ, బుజ్జగిస్తూ, హెచ్చరిస్తూ- తెగ హైరానా పడిపోతున్నారు పెద్దవాళ్లు!-

# అతడు భయాన్ని జయించాడు!

జీడిగుంట రామచంద్రమూర్తి

'వేసవి శలవల్లో అక్కడికెడదాం, ఇక్కడికెడదాం అంటూ తులసికి ఆశపెట్టారు... ఇక వారంరోజుల్లో శలవలు అయిపోతున్నాయి... కనీసం ఇవాళైనా అలా ఓషన్‌పార్కుకో, మౌంట్‌ఓపెరాకో దాన్ని తీసుకెడదాం'- అంటూ పొద్దున్న బెడ్‌కాఫీ చేతికందించిన శారద సూచన లాంటి హెచ్చరిక చేయటంతో- మా తులసిని తీసుకుని పార్కుకొచ్చాం!

ఓ గంటసేపు ఆటలాడింతర్వాత- 'వాటర్‌గేమ్స్' పుణ్యమా అని అది బట్టలు తడిపేసుకుని వచ్చింది... అలా జరుగుతుందని ముందే ఊహించింది కాబోలు- దాని కోసం శారద ఇంకో డ్రస్సు తెచ్చింది...అది వేసుకున్నాక పాప్‌కర్న్, ఐస్‌క్రీమూ వగైరా చిరుతిళ్లులాగించి- అక్కడున్న ఓ ఉయ్యాల బల్ల ఎక్కింది తులసి...దానికాళ్లు నేలకు అందకపోవటంతో ఆ ఉయ్యాల ఊపే డ్యూటీ శారద తీసుకుంది...

ఆ పరిసరాల్లోనే- నేను అటూ ఇటూ పచార్లు చేస్తూంటే- 'హలో భాస్కరం' అంటూ ఎవరో నన్ను పిలిచినట్లు అనిపించి, వెనక్కి తిరిగి చూశాను... పరుగులాంటి నడకతో నావైపే వస్తున్న అతన్ని చూసి, వెంటనే పోల్చుకోలేకపోయాను...

''ఏమిట్రో అలా చూస్తున్నావ్?- గుర్తుపట్టలేదా?''- నా దగ్గరగా వచ్చి చేయి పట్టుకుని- చిరునవ్వుతో చూస్తూ అడిగాడు...ఆమాత్రం ఓరనవ్వుకే దొరగా సొట్టలు పడిన అతని బుగ్గల్ని చూసి- వెంటనే గుర్తు పట్టేశాను!

అతను...కాదు, వాడు రమణ!- ఒకప్పటి నా ప్రాణ మిత్రుడు!... వాడన్నా, వాడి నవ్వన్నా, నవ్వినప్పుడు సొట్టలు పడేవాడి బుగ్గలన్నా, అప్పుడు వాడి కళ్లల్లో కనిపించే మెరుపన్నా నాకు చాలా ఇష్టం...

రమణా, నేనూ తణుకులో- ఆరో క్లాసునించీ ఇంటర్ వరకూ కలిసే చదువుకున్నాం... అన్నదమ్ముల్లా కలిసిమెలిసి తిరిగాం... వాళ్లు మా ఇంట్లోని పెరటివాటాలో అద్దెకుండేవారు... రమణ వాళ్ల నాన్నగారు షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేసేవారు... అందుకని వాళ్లకి పంచదార 'ఫ్రీ'గా వచ్చేది కాబోలు- తరచుగా వాళ్లింటో స్వీట్లు తయారవుతూండేవి... అస్తమానూ ఆ స్వీట్లు తినటం వల్ల కావచ్చు- వాళ్లింట్లో అందరూ తియ్యగా మాట్లాడేవారు!

ఇంటర్ ప్యాసయ్యాక, నేను భీమవరం కాలేజీలో డిగ్రీ చదివాను. రమణ రాజమండ్రీ వెళ్ళి పాలిటెక్నిక్‌లో చేరాడు. అప్పట్నించీ వేసవి శలవల్లో మాత్రమే కలుసుకుంటూండేవాళ్లం... డిగ్రీ అయ్యాక, నేను సర్వీసు కమీషన్ పరీక్ష రాసి హైదరాబాద్‌లో ఉద్యోగానికి వచ్చేశాను...తర్వాత రెండేళ్లకి- రమణ వాళ్ల నాన్నగారికి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ కావటంతో- వాళ్లంతా అక్కడకు 'షిఫ్ట్' అయిపోయారు...

అంతే...! అప్పట్నించీ రమణకీ నాకూ మధ్య దూరం క్రమేపీ పెరిగిపోయింది...మాస్నేహం కేవలం జ్ఞాపకాలకే మిగిలిపోయింది...!

మళ్లీ పదిహేనేళ్ల తర్వాత...ఇప్పుడు హఠాత్తుగా వాడు నాముందు ప్రత్యక్షం కావటంతో- చాలా సంతోషం కలిగింది...

''ఇదేమిట్రా?... నువ్వు..ఇలా... ఇక్కడ?''- ఆ సంతోషం ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే నానోట మాట కరువైంది...

''చెప్తానుండు!''- అంటూనే, తనవెనకాల వున్న భార్యను ముందుకు లాగి- ''మీట్ మై వైఫ్- ప్రణవి''- అంటూ పరిచయం చేశాడు.

నేను కూడా శారదనీ, తులసినీ పిల్చి, వాళ్లకు పరిచయం చేసి ''-మీ పిల్లలేరీ?''-అని అడిగాను...

''వాళ్లను వెతుక్కుందుకే ఈ పార్కుకొచ్చాం!''-నవ్వుతూ చెప్పాడు రమణ.

నాకు అర్థం కాలేదు.

''వెతుక్కోవటం ఏమిట్రా?''- అడిగాను.

''మాకు పిల్లలు లేర్రా బాబూ!... ఒకవేళ మాకు


USE
ME

అమ్మాయో, అబ్బాయో పుట్టి వుంటే– ఈ పార్కుకి వచ్చిన పిల్లల్లో ఎవరిలా వుంటారో చూసుకుందామనీ...''–

తమకు పిల్లలు కలగలేదన్న బాధ వాడి మాటల్లో ఏమాత్రం కనిపించకపోయినా– నాకు మాత్రం మనసు కలుక్కుమంది...

''హాయ్...స్వీటీ...నీ పేరేమిటీ?''– అంతలో మా తులసిని దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దు పెట్టుకుని అడిగింది ప్రణవి... తులసి తనపేరు చెప్పింది...

''ఏ బ్యూటిఫుల్ నేమ్ ఫర్ ఎ బ్యూటి ఫుల్ బేబీ!''– అంటూ ప్రేమగా దాని బుగ్గగిల్లి, ఆవేళ్ల కొసల్ని ముద్దుపెట్టుకున్నాడు రమణ...

''ఇంతకీ... నువ్వు ఈ హైద్రాబాద్ ఎందుకొచ్చావో... అసలు ఎక్కడుంటున్నావో చెప్పలేదు!''– ఆతృతను అణచుకోలేక అడిగాను...

''ఆర్నెల్లనించీ నేనీ హైదారాబాద్‌లోనే వుంటున్నాన్రా!... రోజూ నీ గురించి తల్చుకుంటూనే వున్నా... కానీ నీ వేరేబవుట్స్ తెలీక...'' చెప్పాడు.

రాజమండ్రిలో చదువు పూర్తయ్యాక, వైజాగ్‌వెళ్లి వాళ్ల నాన్నగారి దగ్గరే వుండి 'షిప్‌యార్డ్'లో కొంతకాలం టెంపరరీ ఉద్యోగం చేసినట్టు చెప్పాడు. ఆ తర్వాత రెండేళ్ల పాటు ఏదో కంప్యూటర్ కోర్సులో శిక్షణ తీసుకున్నాడట... ఫలితంగానే హైదరాబాద్‌లో 'జాబ్' దొరికిందని చెప్పాడు.

''అయితే ఇక మనం తరచుగా కలుసుకుంటూ వుండచ్చు!'' ఉత్సాహంగా చెప్పాను...

''మన సంగతి ఎలా వున్నా.. మీ తులసిని చూసేందుకైనా నేను మీ ఇంటికి వస్తూంటాను''– అన్నాడు రమణ.

అక్కడున్న 'లాన్'లో కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకున్నాం.

''వచ్చే ఆదివారం మీరిద్దరూ మాఇంట్లో డిన్నర్‌కి రావాలి అన్నయ్య గారూ!''– విడిపోయేటప్పుడు శారద వాళ్లను ఆహ్వానించింది...

''తప్పకుండా వస్తాం చెల్లెమ్మా!... మీ తులసితో కబుర్లు చెప్పటానికైనా రావాలిగా!''– తులసి బుగ్గ మరోసారి గిల్లి ముద్దు పెట్టుకుని చెప్పాడు... పక్కనే వున్న షాపులోంచి చాక్లెట్లు కొని తెచ్చి తులసికి ఇచ్చాడు


***

మా స్నేహం మళ్లీ బలపడింది...రోజూ ఏదో ఒకవేళలో మేం ఫోన్ చేసుకుంటూనే వున్నాం...వీకెండ్స్‌లో తప్పనిసరిగా రమణ మా ఇంటికి వస్తూనే వున్నాడు... వచ్చినప్పుడల్లా తులసి కోసం స్వీట్లో, చాక్‌లేట్లో తెస్తూనే వున్నాడు...

''మీరిలా మా ఇంటి కొచ్చినప్పుడల్లా దానికోసం ఏదో ఒకటి తీసుకురావటం బాగాలేదన్నయ్యగారూ!'' అంది శారద ఓసారి.

''పిల్లలు దేవుడితో సమానం కదమ్మా!... మరి వాళ్లను చూట్టాని కొచ్చినప్పుడు వట్టిచేతుల్తో ఎలా వస్తాం?.. పైగా... నాకు పిల్లలంటే చాలా ఇష్టం.. మీ తులసి అంటే మరీ మరీ ఇష్టం!''– మెరిసే కళ్లతో తులసి వైపే చూస్తూ చెప్పడు రమణ...

ఆ ఇష్టంతోనే రమణ మా ఇంటికి తరచుగా వస్తున్నాడని నేను అర్థం చేసుకున్నాను...అప్పుడప్పుడు తనతో పాటు తులసిని నెక్లెస్ రోడ్డుకీ ఎన్టీఆర్ గార్డెన్స్‌కీ తీసుకెడుతున్నాడు...రకరకాల బొమ్మలూ, రంగురంగుల డ్రెస్సులూ కొనిస్తున్నాడు.




''మా తులసిని నువ్వు మరీ గారం చేసేస్తున్నావ్‌రా రమణా!... దానికోసం అనవసరంగా బోలేడు డబ్బు ఖర్చుచేయటం బాగాలేదు''– అన్నాను నేను కూడా ఓసారి.

''నిజమేరా!.. కన్నతండ్రిగా నువ్వలా భావించటంలో తప్పులేదు.. కానీ నేను పరాయివాణ్ణి కాదుకదరా!... నీ ప్రాణస్నేహితుణ్ణి!... ఏ జన్మలోనో నేను పిల్లల్ని ద్వేషించి వుండాలి.. అందుకే ఈ జన్మలో నాకా అదృష్టం లేకుండాపోయింది.. మీ తులసిని చూసి ఆ బాధ నేను మర్చిపోతున్నాన్రా!... ఇంక ఖర్చంటావా?.. అంతా నా ఆనందంకోసమే...! ఉన్నవాళ్లం ఇద్దరం... వచ్చే జీతం వేలల్లో!.. మిగుల్చుకుని రేపు మా కూడా పట్టుకుపోం కదా!''– నవ్వుతూనే చెప్పాడు...

ఆ నవ్వే నన్నెప్పుడూ కట్టిపారేస్తుంది...

''అయినా ఇవాళ వైద్యవిజ్ఞానం ఎంతో పెరిగిపోయింది... పెద్ద పెద్ద హాస్పిటల్సూ గొప్ప గొప్ప డాక్టర్లూ ఎందరో వున్నారు... నువ్వూ మీ ఆవిడా ఓసారి వెళ్లి– ఇంతకాలం మీకు పిల్లలు ఎందుకు కలగలేదో– లోపం ఎవరిలో వుందో– పరీక్షలు చేయించుకోలేక పోయారా?''– ఉండబట్టలేక అడిగాను...

నా ప్రశ్న వినగానే రమణ ముఖంలో రంగులు మారాయి... కుడిచేత్తో ఓసారి రెండు కణతలూ నొక్కుకుంటూ– కళ్లుమూసుకున్నాడు... ఆతర్వాత రెండుక్షణాలకే మళ్లీ మామూలుగా మారిపోయి, అదే చిరునవ్వుతో నావైపు చూస్తూ చెప్పాడు–

''పరీక్ష చేయించుకున్నాం రా!.. చేసిన డాక్టరే, మమ్మల్ని పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడమని హెచ్చరించాడు!''

నేను షాకయ్యాను.

''అదేమిటి అన్నయ్యగారూ? ఎందుకలా?... ఎవరైనా పెళ్లయ్యాక ఏడాదో, రెండేళ్లో పిల్లలు కలక్కుండా జాగ్రత్తపడతారు... లేదంటే ఒకరిద్దరు పుట్టాక ఇక వద్దనుకుని– ఏ ఆపరేషనో చేయించుకుంటారు... అలాంటిది– మీకసలు పిల్లలే వద్దని చెప్పటం ఏమిటీ?''– నా పక్కనే కూర్చున్న శారద అడిగింది...

రమణ చెప్పే సమాధానం కోసం నేను కూడా ఆత్రంగా చూశాను.

''మాకు... మాకు పిల్లలు పుడితే వాళ్లక్కూడా...'హెచ్ఐవీ' సోకుతుందనీ...''– చెప్తూంటే రమణ కళ్లల్లో కన్నీళ్లు కదలటం గమనించాను...

నేనూ, శారదా ఉలిక్కిపడ్డాం...

''హెచ్.ఐ.వీ సోకటం ఏమిట్రా?''– వాడి దగ్గరగా వచ్చి కూర్చుని, భుజం మీద చెయ్యి వేస్తూ అడిగాను.

రమణ వెంటనే– నా చెయ్యి తీసేసి– కొంచెం దూరంగా జరిగాడు.

''వద్దురా!... మరీ అంత దగ్గరగా రావద్దు... నేను హెచ్ఐవీ పేషెంటుని!''– కళ్లలోంచి జారి పడబోతున్న కన్నీటి చుక్కల్ని మునివేళ్లతో లోపలకు నొక్కేసుకుంటూ చెప్పాడు.

''ఏమిటి అన్నయ్యగారూ, మీరు చెప్తున్నది?''– కలవరపాటుగా చూస్తూ అడిగింది శారద...

''ఇంత వరకూ ఈ నిజాన్ని ఎవరికీ చెప్పలేదు చెల్లెమ్మా!.. కానీ ఇప్పుడు... మీకు చెప్పకపోతే– నా బాల్యమిత్రుడికి ద్రోహం చేసినట్టవుతుంది..''– అంటూ జేబులోంచి కర్చీఫ్ తీసి– ముఖం తుడుచుకున్నాడు...

అయిదారు క్షణాలు భయంకరమైన నిశ్శబ్దంతో గడిచాయి... రమణ గాఢంగా నిట్టూర్చి, సోఫాలో వెనక్కి జారగిలబడి కూర్చుని– చెప్పటం ప్రారంభించాడు–

''ఓ సారి నేను, వైజాగులో– స్కూటరు మీద ఆఫీసుకి వెడుతూంటే యాక్సిడెంటయింది... లారీ కింద పడ్డాను.. నా స్కూటర్ చచ్చిపోయింది... నేను మాత్రం తలకు బలమైన గాయాలతో బతికిపోయాను...కానీ రక్తం బాగా పోయింది. స్పృహలేని స్థితిలో వున్న నన్ను ఆస్పత్రితో చేర్పించారు... రక్తం అర్జంటుగా ఎక్కించాలన్నాడు డాక్టరు... నా రక్తం చాలా అరుదైన 'గ్రూప్' ది కావటంతో వెంటనే దొరకలేదు... ఆ సమయంలో డాక్టర్‌గారే పైడిరాజుకి ఫోన్ చేసి పిలిపించారు!''

''పైడిరాజెవరూ?''– అడిగాను.

''ఆ పరిసరాల్లో తిరిగే ఆటో డ్రైవరు... అతనిది కూడా నాగ్రూప్ రక్తమేనని ఆ డాక్టరుకి తెలుసు... తాగుడికి డబ్బుకావాల్సినప్పుడల్లా అతను రక్తం అమ్ముకుంటాడు... అందుకే అతన్ని పిలిచారు... ఆ రక్తం నాకు ఎక్కించారు..''

రమణ ఇక పూర్తిగా చెప్పనవసరం లేకుండానే విషయం నాకర్థమైంది.

''అంటే... ఆ పైడిరాజుకి ఎయిడ్స్ వుందన్న మాట!''- అన్నాను వాడివైపు ఆందోళనగా చూస్తూ.

''ఉందన్న విషయం ఆ తర్వాత ఏడాదివరకూ నాకు తెలియలేదు... ఆ మాటకొస్తే పాపం.. ఆ డాక్టరుగారికీ తెలీదు!... అయితే ఈ సంఘటన జరిగిన ఏడాదికి- ఆ పైడిరాజు చనిపోయాడు. అతను 'ఎయిడ్స్' వ్యాధి కారణంగా పోయినట్టు తెలిసింది... వెంటనే ఆ డాక్టరు- అతని రక్తాన్ని అంతవరకూ ఎవరెవరికి ఎక్కించారో వివరాలు సేకరించి వాళ్లనందర్నీ పిలిపించారు... మొత్తం అయిదుగురం! అందరిదీ రక్తం తీసకుని పరీక్షలు చేయించారు... ముగ్గురికి హెచ్.ఐ.వి పాజిటివ్ వచ్చింది... ఆ ముగ్గురిలో నేనూ ఒకణ్ణి!''- చెప్పాడు రమణ.

వాడి ముఖంలో ఎలాంటి భావమూ, భయమూ కనిపించలేదు.

''వాటె ట్రాజెడీ?''- అంది శారద జాలిగా, బాధగా రమణ వైపు చూస్తూ...

''అఫ్‌కోర్స్!... కానీ ఈ ట్రాజెడీ మరిన్ని ట్రాజెడీలకు దారి తీయకపోయటం ఒకరకంగా నాకు సంతోషాన్నే కలిగించిందమ్మా!''

వాడిమాటల్లోని అంతరార్థం మాకు బోధపడలేదు. ఇంతలో వాడు మళ్లీ చెప్పాడు-

''సరిగ్గా ఆ సమయంలోనే నాకు పెళ్లి నిశ్చయమైంది!... 'ఎంగేజ్‌మెంట్' కూడా జరిగిపోయింది... ముహూర్తం ఇంక నెలరోజులుందనగా ఈ విషయం బయటపడటంతో- నేను అప్పటికేదో కారణం చెప్పి- ఆ పెళ్లి వద్దన్నాను!''

''అంటే... అసలు విషయం... మీ ఇంట్లో చెప్పలేదా?''- అడిగాను.

''లేదు! వాళ్లకు తెలియనివ్వలేదు... నా జీవితం అర్థరహితంగా, అర్థాంతరంగా అంతమైపోతుందని నాకు తెలుసు... అలాంటప్పుడు - ఈ దారుణం గురించి వాళ్లకుచెప్పి- బాధ పెట్టటం నాకు ఇష్టం లేకపోయింది... కానీ అమ్మా, నాన్నా నన్ను ఒదిలిపెట్టలేదు... మళ్లీ సంబంధాలు చూడటం ప్రారంభించారు... సరిగ్గా అదే సమయంలో పేపర్లో వచ్చిన ఓ వార్త నా కంటపడింది... కేరళలో ఒకచోట 'ఎయిడ్స్' వ్యాధిగ్రస్తుల కోసం ఒక పునరావాస కేంద్రం నిర్వహించబడుతోందనీ- అందులో వుంటున్న వారి పోషణ కోసం దాతలు ముందుకు రావాలనీ ఆ ప్రకటనలో కోరారు... చూద్దామని వెళ్లాను... నాలాగే అన్యాయంగా హెచ్.ఐ.వి బారినపడిన 'ప్రణవి' నన్ను ఆకర్షించింది.. ఆ కేంద్రం నిర్వాహకులకు నా విషయం చెప్పి, ఒప్పించి, ఆమెను అక్కడే పెళ్లి చేసుకుని వైజాగ్ తీసుకొచ్చాను!''

''మైగాడ్!... అంటే మీ భార్య కూడా...'' శారద నోట మాట పెగల్లేదు...

''అవును చెల్లెమ్మా!.. తను కూడా హెచ్ఐవీ పేషెంటే!''- చెప్పాడు రమణ.

''మరి మీ వాళ్లు ఏమీ అన్లేదా?''- అడిగింది శారద వెంటనే.

''వాళ్లకు చెప్పకుండా పెళ్లి చేసుకున్నందుకు- మొదట్లో కొంచెం బాధపడినా తర్వాత అడ్జస్టయిపోయారు... ఆ తర్వాత ఏడాదికే నాన్న పోయారు... అమ్మ మా దగ్గర కొచ్చేసింది.. మాకు కొడుకు పుడితే- నాన్నపేరు పెట్టాలంటూ రోజూ గుర్తు చేసేది... కానీ డాక్టర్ సలహాపై, మేం అసలు పిల్లలే కలక్కుండా జాగ్రత్తపడుతున్నమని ఆవిడకు తెలీదుగా!... అందుకే నాలుగేళ్లయినా ప్రణవికి ప్రెగ్నెన్సీ రాకపోవటంతో- డాక్టరు దగ్గరకెళ్లి పరీక్ష చేయించుకోమంటూ మమ్మల్ని కోరుతూండేది... ఇక లాభం లేదనుకుని- మాలోనే దాచుకున్న నిజాన్ని అమ్మకి చెప్పేశాను... నాలుగైదు రోజులు అన్నం, నిద్రా మానేసి ఏడ్చింది... మనోవేదనతో మంచంపట్టి- ఆర్నెల్లయినా తిరక్కుండానే కన్ను మూసింది... కానీ నాకు, ఎందుకో ఏడుపే రాలేదురా!''- చెప్పటం ఆపి బరువుగా నిట్టూర్చాడు రమణ.

''సారీ రా! అయామ్ వెరీసారీ!... .నీ జీవితంలో ఇంత విషాదం ఉందనుకోలేదు!''-కళ్లల్లో నీళ్లు గిర్రున తిరుగుతూంటే- ఇంకేం అనాలో తెలీక అలా అన్నాడను...

''నో...నో! నేనసలు ఇది విషాదం అనుకోవటం లేదురా!...'' భుజాలు ఎగరేసి, చిర్నవ్వు పెదాలమీదకు తెచ్చుకుంటూ చెప్పాడు.

''ఆ జబ్బుకి చికిత్స లేదనీ- అది సోకితే పది పదిహేనేళ్లకు మించి బతకరనీ అంటారు... మరీ మీకు భయం లేదా?.. ఇలా ఎప్పుడూ చిర్నవ్వుతో ఎలా వుండగలుగుతున్నారో నాకు అర్థం కావటంలే దు!'' -వాడిపైపు సానుభూతిగా చూస్తూ అంది శారద.

వాడు మళ్లీ నవ్వాడు.

''మీకో విషయం చెప్పనా?''-

శారదా నేనూ వాడి వైపు ఆసక్తిగా చూశాం.

''నేను ఇంతకు ముందు పనిచేసిన ఆఫీసులో రాఘవ అని- నాకో ఫ్రెండు వుండేవాడు. నా వయస్సే!... ఎలాంటి దురలవాటూ లేదు. ఎప్పుడూ అతని ముఖంలో చిరునవ్వు, ప్రశాంతతా మాత్రమే కనిపించేవి తప్ప- అలసటా, ఆందోళనా వుండేవి కాదు- అలాంటివాడు ఆఫీసులో పనిచేస్తూ, చేస్తూ- సడెన్‌గా కుర్చీలో పక్కకి వాలిపోయాడు. 'ఏమైంది రాఘవా'- అంటూ దగ్గరకెళ్లి చూస్తే -అప్పటికే అతని ప్రాణం గాలిలో కలిసిపోయింది... అంతే!... అంతవరకూ నా గురించి నాలో ఏ కొంచెమైనా భయం వుండేదేమో! అతని హఠాన్మరణం నా భయాన్ని పూర్తిగా పోగొట్టింది...! ఒకవేళ నాకు ఈ వ్యాధి రాలేదే అనుకో- అప్పుడు మాత్రం రేపోమాపో వేరే కారణంగా -చనిపోకూడదని గ్యారంటీ ఏముంది?... అందుకే బతికినంత కాలం నిబ్బరంగా వుండాలనీ -నవ్వుతూ కనిపించాలనీ -నేనూ ప్రణవీ నిర్ణయించుకున్నాం!... డాక్టరుగారి సలహాలు పాటిస్తున్నాం... మరీ మా వ్యాధి ముదిరిపోయి, నలుగురి కళ్ల ముందూ పడితే- అప్పుడు కేరళలో వున్న ఆ పునరావాస కేంద్రానికే వెళ్లిపోతాం!''

మేమిద్దారం దాదాపు శిలాప్రతిమలైపోయాం... రమణ సోఫాలోంచి లేచి నిలబడ్డాడు...

''ఇంతవరకూ నాగురించి ఎవరికీ చెప్పలేదు... నీక్కూడా చెప్పకపోతే ద్రోహం చేసిన వాణ్ణవుతానేమో నన్న 'గిల్టీ ఫీలింగ్' కలిగింది... అందుకే చెప్పేశాను... ఇకనించీ మీ ఇంటికి రావద్దంటే- మానేస్తాను!... కానీ నన్ను మాత్రం అసహ్యించుకోవద్దు... నేను మట్టిలో కలిసిపోయే దాకా మన స్నేహాన్ని కొనసాగించు... ప్లీజ్!''- అంటూ నా చేయి పట్టుకోబోయి, మళ్లీ ఆ ప్రయత్నం మానేసి వెనుతిరిగాడు...

గుమ్మం వరకూ వెళ్లి- ఆగిపోయి- వెనక్కి తిరిగి చూస్తూ మళ్లీ అన్నాడు-

''ఒరేయ్!... నాకు మీ తులసంటే చాలా ఇష్టం రా!... అప్పుడప్పుడు ఫోన్లో అయినా నాతో మాట్లాడించు... అదీ, మేం కేరళా వెళ్లే వరకే! వస్తాను... బై!''-

నా కళ్లల్లో నిలిచిన కన్నీటి పొరల మధ్యనించి- రమణ కనుమరుగవటం కనిపించింది...!

*

## దీపికా డిమాండ్!

దీపికా పదుకొనే, రన్‌బీర్ కపూర్ జంటగా నటించిన 'బచ్‌నా యే హసీనో' చిత్రం మంచి విజయం సాధించింది. దాంతో దీపికా పదుకొనే తన పారితోషకానికి మరికొన్ని అంకెలు జత చేసింది. ''నాకు, నా నటనకు ఎంత విలువుందని నేననుకుంటానో అంతే పారితోషకం అడుగుతాను. నాకు ఆ పారితోషకం చెల్లిస్తున్నారంటే, నేను దానికి తగిన దాన్ననేగా అర్థం. ఎవరూ తమకు నమ్మకం లేని నటుల మీద పెట్టుబడి పెట్టాలనుకోరుగా,'' అంటూ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటోంది. నిజానికి ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆమె విలువ చాలా ఉంది. నటన, అందాల మేలుకలయికగా ఆమెను అభివర్ణిస్తున్నారు. అందుకే, పారితోషకం ఎంతైనా, ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ తన తరువాతి చిత్రానికి ఆమెనే ఏరికోరి ఎంపిక చేసుకున్నాడు.

